

పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



- సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామస్థాయిలో సమర్ధవంతమైన పాలనలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరా, అక్రమ లేఅవుట్ల కట్టడి, పన్నుల వసూలు, సచివాలయ సిబ్బంది హాజరు తదితర అంశాలపై ఎంపిడిఓలు, ఈఓ పిఆర్‌డిలు మరింత బాధ్యతగా తమ విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓపిఆర్‌డిలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల కట్టడికి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి అధికారులు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, దీనితో పాటు సురక్షితమైన త్రాగునీటిని ప్రజలకు అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, డయేరియా, చికున్ గున్యా, తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కలుషిత తాగునీరే వీటన్నిటికీ ప్రధాన కారణమన్నారు. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి పనిచేయాలని సూచించారు. పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అందుబాటులో ఉన్న నిధుల నుండి జీతాలు చెల్లించాలని, ఈ విషయంలో సర్పంచులతో పంచాయతీ సెక్రెటరీలు సమన్వయం చేసుకుని జీతాల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఓలు, ఈఓ పిఆర్‌డిలు విధిగా గ్రామాలలో పర్యటించడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణపై ఒక అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. పంచాయతీ సెక్రెటరీలు మున్సిపాలిటీ తరహాలో గ్రామాలలో కూడా ఉదయమే పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని, దీనితో పాటు గ్రామాలలో మరియు సంక్షేమ హాస్టల్స్‌లోని వాటర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని, పైపులైన్ లీకేజీలపై చర్యలు తీసుకోవాలని తద్వారా సీజనల్ వ్యాధులను కొంత వరకు కట్టడి చేయవచ్చునన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా సీజనల్ వ్యాధులు నమోదైన వెంటనే మండల, గ్రామస్థాయిలోని అధికారులు అప్రమత్తమై కట్టడికి చర్యలు చేపట్టడం ద్వారా ఆ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. వాటర్ టెస్టింగ్ రిపోర్ట్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ స్థానికంగా ఉన్న ఆరోగ్య సిబ్బందితో ఫీవర్ సర్వేకి సంబంధించి వివరాలను తెలుసుకుని మండలస్థాయిలో సర్వసభ్య సమావేశంలో ఈ అంశాలపై ఎంపిడిఓలు ప్రజాప్రతినిధులతో చర్చించి సత్వరచర్యలు చేపట్టడం ద్వారా వ్యాధులను కట్టడి చేయవచ్చునని సూచించారు. దీంతో పాటు సకాలంలో పంచాయతీలలో పన్నుల వసూళ్ల ద్వారా పంచాయతీల ఆదాయం పెంపునకు కృషి చేయాలని, అక్రమ లే అవుట్‌లను కట్టడి చేయాలన్నారు. గ్రామస్థాయిలో ఉన్న సచివాలయ వ్యవస్థలో పనిచేసే సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, సమయపాలనను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, సచివాలయానికి వచ్చే అర్జీల నమోదు సంబంధించి రికార్డులను సంబంధిత రిజిష్టర్‌ల నిర్వహణను కూడా ఎంపిడిఓలు తనిఖీలో పరిశీలించాలన్నారు. ప్రతి మండల పరిధిలో ఎంపిడిఓలు సచివాలయాల వారీగా అసంపూర్తిగా ఉన్న అన్ని రికార్డులను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పి సీఈఓ గ్లోరియా, డిపిఓ లక్ష్మీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్ కుమార్, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతీ దేవి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలి

జిల్లాలో శాంతిభద్రతలు కాపాడాలి: రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఉన్న ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టబోయే పోరాటాలపై శనివారం చిత్తూరు జిల్లా ఆఫీసులో జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ మూడోసారి ప్రధాని కావడం మెజార్టీ లేకుండా ఇతరుల మెజార్టీతో అయ్యారని విమర్శించారు. 400 సీట్లు వస్తాయని ప్రగ్భాలు పలికిన మోడీ భారీస్థాయిలో ప్రజలు బిజెపిని తిరస్కరించడంతో మెజార్టీ రాక తెలుగుదేశం, జెడిఎస్ మద్దతుతో అధికారం చేపట్టారన్నారు. అయినప్పటికీ ఇష్టారాజ్యంగా ప్రజా సమస్యలు పరిష్కారం చేయకుండా దాడి చేయడం దారుణమన్నారు.
కార్మికవర్గం ప్రజలు పోరాటాలతో బిజెపిని తిరస్కరించిన ఇంకా తెచ్చుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని తెలుగుదేశం సంకీర్ణ ప్రభుత్వం బిజెపిపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రత్యేక హోదా వచ్చే విధంగా పోరాడాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో అధికారంలో ఉన్న పార్టీ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనే వీరు కూడా చేయడం ఏమిటని ప్రశ్నించారు.
పుంగనూరులో గత ప్రభుత్వం అరాచకాలను దౌర్జన్యాలను ప్రజలు తిరస్కరించారు. అయితే నేడు తెలుగుదేశం కూడా అదే తప్పు చేస్తూ భౌతికదాడులకు దిగడం దారుణమన్నారు. శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు. రోజుల తరబడి 144 సెక్షన్ విధించి సామాన్య ప్రజానీకానికి ఇబ్బంది కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదన్నారు. జిల్లాలో వెంటనే కాపాడి పుంగనూరు ప్రజలు ప్రశాంతంగా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో దసరా వారి పోరాటాలను చేపడుతున్నామని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప భౌతికంగా దాడులు చేసుకోవడం ఇరు పార్టీలకు సమంజసం కాదని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం సంకీర్ణంలో ఉన్నప్పటికీ ప్రజాసమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రజావ్యతిరేక విధానాల అవలంబించడం సరైనది కాదన్నారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్త అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబుల్ రాజు, భువనేశ్వరి, ప్రసాద్, మురళి, జ్యోతి, బాలసుబ్రమణ్యం, దాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు పెద్దపీట : ఈవో

ప్రజాశక్తి - తిరుమల




ప్రపంచ నలుమూలల నుండి ప్రతి రోజూ వేలాదిగా తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులకు మరింత సౌకర్యవంతంగా దర్శనం, వసతి, అన్న ప్రసాదాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు టీటీడీ ఈవో జె. శ్యామలరావు చెప్పారు. అదేవిధంగా తిరుమల పవిత్రతను మరింతగా పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమలలోని అన్ని విభాగాలను నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో ప్రతిరోజూ రెండు లక్షల మంది భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలు, పాలు, తాగునీరు నాణ్యతను మరింత పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఉదయం అల్పాహారము, మధ్యాహ్నం, రాత్రి భోజనాలలో భక్తులకు అందించవలసిన ఆహార పదార్థాలను నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రముఖ ఆహార పదార్థాల తయారీ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, వారు సూచించిన విధంగా అన్నప్రసాద భవనంలో సిబ్బందిని పెంచడం, వంటశాలల ఆధునీకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగం (ఎఫ్ఎస్ డి) వారు ఏర్పాటుచేసిన మొబైల్ ల్యాబ్ లో 80 రకాల పదార్థాలను పరీక్షించవచ్చని చెప్పారు. తిరుమలలో హోటల్ నిర్వాహకులు టీటీడీ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, రేట్లు ఉండాలన్నారు. లీజు దారులు సబ్ లీజుకు ఇవ్వకూడదని, తదితర అంశాలతో నూతన పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు. టీటీడీ ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనము, వసతి తదితర సేవల బుకింగ్‌లో లోపాలను సరిదిద్దుతామన్నారు. గతంలో వారానికి 1.05 లక్షలు ఇస్తున్న ఎస్ఎస్‌డి టోకెన్లను, భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించేందుకు ప్రస్తుతం 1.47 లక్షలు ఇస్తున్నామని, వీటిని మరికొంత పెంచేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సిపిఆర్‌ఓ డాక్టర్ రవి, పాల్గొన్నారు.

ఇంఛార్జి ఉపకులపతిగా

బాధ్యతలు స్వీకరించిన దొరస్వామి

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వ విద్యాలయం ఇంఛార్జ్ ఉపకులపతిగా ఆచార్య ఎం.దొరస్వామి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మొదటి వర్సిటీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంఛార్జీ ఉపకులపతిగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా దొరస్వామి వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉన్నత విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ బోధన బోధనేతర సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించిన శాలువతో సత్కరించారు. వర్సిటీ ఇన్చార్జి రిజిస్ట్రార్ ఎం.మాధవ నాయుడు, డీన్ అకాడమిక్ అఫైర్స్ ఆచార్య కే.శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్ కిరణ్ కుమార్



ద్రావిడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ వి.కిరణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రిజిస్ట్రార్‌గా తనకు బాధ్యతలు అప్పగించిన ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ దొరస్వామికి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ భోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు నూతన రిజిస్ట్రార్‌కు అభినందనలు తెలిపారు.

పింఛన్ల వడపోత

- ఉంటాయా..? ఊడుతాయా..?
- ఆందోళనలో పింఛనుదారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జులై నెలలో వైయస్సార్ పింఛన్‌ను ఎన్టీఆర్ భరోసా అనే పేరుతో అప్పటి వరకు ఉన్న లభ్యదారులందరికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన ఫించన్‌తో కలిసి మూడు నెలలకు రూ.7వేలను అందించింది. అయితే ఆగస్టు ఒకటో తేదీ దగ్గర పడుతున్న కొద్దీ జిల్లాలోని సామాజిక పెన్షన్లు పొందుతున్న లభ్యదారుల్లో ఆందోళన మొదలైంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నెల నుండి అదనంగా వెయ్యి రూపాయల పెంచి లభ్యదారులకు అందించింది. అయితే ఆగస్టు నెలలో గత ప్రభుత్వం అర్హులుగా గుర్తించి అందించిన సామాజిక పెన్షన్లను వడపోసి తగ్గించే అవకాశం ఉన్నట్లు పింఛనుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


గత 15రోజులుగా జిల్లాలోని వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, డప్పు కళాకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్లు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలను సామాజిక భద్రత పెన్షన్లు చిత్తూరు జిల్లాలో 1,74,540 మంది పొందుతున్నారు.

గత ప్రభుత్వం సామాజిక పింఛన్ లబ్ధిదారుల గుర్తింపులో పక్షపాత ధోరణి పాటిస్తూ తమ పార్టీకి అనుకూలమైన వ్యక్తులను లబ్ధిదారులుగా గుర్తించారంటూ తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుంచో ఆరోపిస్తోంది. ఈ మేరకు ప్రస్తుతం చేపడుతున్న సర్వేలో అనేక మందిని అనర్హులుగా ప్రకటించి సామాజిక పెన్షన్లు రద్దు చేసే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో చిత్తూరు రూరల్ మండలం పచ్చనపల్లి గ్రామంలో ఏడుగురు డప్పు కళాకారులు గత ఐదు సంవత్సరాలుగా నెలకు రూ.3000ల చొప్పున పెన్షన్ పొందుతున్నారు. జులై నెల రూ.7వేల పెన్షన్ కూడా అందుకున్నారు. వీరిలో ఆనందం (68) అనే డప్పు కళాకారుడి పెన్షన్లు తొలగిస్తున్నట్లు ఆ గ్రామంలో సర్వే చేసిన అధికారులు వెల్లడించారు. ఆగస్టు నెల పెన్షన్ రాదని చెప్పడంతో ఆనందం అన్ని రకాలుగా అర్హుడైన తన పెన్షన్ తొలగించడం పై ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇదే తరహాలో ఆగస్టు నెలలో వేలసంఖ్యలో లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటించి ఉమ్మడి ప్రభుత్వం పెన్షన్ల వడపోత దిశగా సర్వే సాగుతున్నట్లు తెలుస్తోంది.



అర్హత ఉన్న పింఛన్ కోల్పోతున్న డప్పు కళాకారుడు ఆనందం

పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



పెనుమూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వార్షిక తనిఖీలో భాగంగా శనివారం పెనుమూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్‌లో అమలు పరచాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్స్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. స్టేషన్ లోని క్రైమ్ రికార్డ్స్‌ను, కేసు డైరీ, రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లోని, నాటు సారా అమ్ముతున్నారని అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చెయ్యాలని సూచించారు. అదే విధంగా పోలీసు స్టేషన్ పరిధిలో గల స్కూల్స్ వద్ద, హెూటల్స్ లాంటి ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, అదే విధంగా రాత్రి మరియు పగల బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. అదే విధంగా రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరాల అడ్డుకట్టకు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని, భూ వివాదాలు, పాత గొడవలు మొదలైన వాటిని లిస్ట్ అవుట్ చేసి ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికి వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, కొత్త చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా వారి పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

ఎంపికి ఘనసత్కారం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుని శనివారం రాధే కన్స్ట్రక్షన్స్ అధినేత రాధేయ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. చిత్తూరు పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో గెలుపొందిన ఎంపికి ప్రసాదరావుకు రాధేయ్ కన్స్ట్రక్షన్స్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో రాధేయ్ కన్స్ట్రక్షన్స్ ఛైర్మన్‌గా ఆ సంస్థకు సేవలందించిన ప్రసాదరావు స్ఫూర్తిని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుబడతామన్నారు. కార్యక్రమంలో రాధేయ్ కన్స్ట్రక్షన్స్ అధినేత రాధేయ్, వికాస్, టి.భాస్కరరావు, నాగార్జున, ఎన్.లక్ష్మణ్ రామ్, వినోద్ రెడ్డి, మహమ్మద్ ఇలియాస్, చంద్రకాంత్, జి.సురేష్, కె.ప్రియదర్శిని, మూర్తి, బసవరాజు, హమ్మేద్, హరీష్, వర్మ, జగదీష్ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో..

బాలికలకు భద్రతేది..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: మద్యం మత్తులో మహిళలు బలి అవుతున్నారన్నది ఒకప్పటి మాట.. ప్రస్తుతం మద్యానికి గంజాయి తోడయ్యింది.. దీంతో అకృత్యాలకు వావివరుసలు లేకుండా పోయాయి. బాలికలకు భద్రత లేకుండా పోయింది.. గంజాయి మత్తులో యువత ఏం చేస్తుందో తెలియనంతగా తూగుతోంది. గత వైసిపి పాలనలో అప్పటి తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి మారువేషాల్లో సైకిల్‌పై సవార్ చేస్తూ గంజాయి లేకుండా చేస్తానని ప్రతినబూనారు. సందుగొందులన్నీ తిరిగారు.. ఫొటోలకు ఫోజులిచ్చారు. టిడిపి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ వైసిపి హయాంలో గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు చేశారని ప్రస్తుతం ఆరోపిస్తున్నారు. మరి కూటమి పాలనలోనైనా గంజాయి అందుబాటులో లేకుండా చేస్తారా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

జిల్లాలో మత్తుపదార్థాల వినియోగం పెట్రేగిపోతోంది. బంగాకు (గంజాయి)కు బానిసవుతున్న ఆకతాయిలు ఆ మత్తులో అరాచకాలకు పూనుకుంటున్నారు. అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలకు తెగబడుతూ వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. మరికొంత మంది మరణాయుధాలతో దాడులకు దిగి, ప్రాణాలను హరించేస్తున్నారు. గడిచిన వారం రోజుల్లోనే ఈ కోవలో జిల్లా వ్యాప్తంగా నాలుగు ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. జిల్లాలో వరుసగా జరుగుతున్న ఘటనలతో బాలికల భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

తిరుపతి జిల్లా ప్రశాంతతకు నిలయం. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రాలు, విహారయాత్ర స్థలాలు, పదుల సంఖ్యలో అత్యున్నత విద్యాకేంద్రాలు, ఎనిమిదికిపైగా విశ్వవిద్యాలయాలు, భారీ పారిశ్రామిక వాడ, అంతరక్ష ప్రయోగవేదిక ఇస్రో నెలకొన్న స్థలం. సముద్రతీరం ఉన్న ప్రదేశం. అనునిత్యం వివిఐపిల రాకపోకలు సాగించే ఏకైక జిల్లా తిరుపతి. ఇంతటి ప్రసిద్ధిగాంచిన జిల్లాలో ఇటీవల బాలికలపై వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలో ప్రజలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సరిహద్దుల్లో ఉన్న రైస్‌మిల్లు అటవీప్రాంతంలో ఎనిమిదేళ్ల చిన్నారని, బీహార్‌కు చెందిన ఓ యువకుడు గంజాయి మత్తులో అపహరించి, అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన మరవకముందే ఏర్పేడు మండలం మునగలపాలెం పంచాయతీ పరిధిలోని మూల కండ్రిగ గ్రామంలో చిన్నారులపై లైంగికవేధింపులు జరిగాయి. బలరామయ్యగౌడ్ అనే మానవమృగం ఈ దారుణానికి ఒడిగట్టాడు. గతంలో ఓ చిన్నారిని అత్యాచారం చేసిన కేసులో జైలు శిక్ష సైతం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా మత్తుకు అలవాటుపడి ఇలాంటి దారుణాలకు ఒడికట్టడం బాధాకరం. గూడూరు రెండో పట్టణ పరిధిలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలికను రెండు రోజుల క్రితం ఓ రౌడీషీటర్ బాలిక ఇంటి ముందే కత్తితో బెదిరించి, బలవంతంగా ఆటోలో ఎక్కించుకునిపోయి అత్యాచారం చేసి, సాయంత్రం ధైర్యంగా కిడ్నాప్ చేసిన పరిసరాల్లో వదిలేచి జారుకున్నాడు. ఈ ఘటనతో అవమానాన్ని భరించలేక బాధితురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ప్రస్తుతం ఆసుపత్రుల్లో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. గురువారం రాత్రి తిరుపతి నడిబొడ్డున తమ బిడ్డతో అసభ్యకరంగా మాట్లాడడం సరైనది కాదన్న కారణంతో ఓ యువకుడు ఇంటిలోకే చొరబడి కత్తితో దారుణంగా నరికి ఓ వృద్ధురాలిని హత్యచేసి, మరో ముగ్గురిపై కత్తితో దాడికి తెగబడ్డాడు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఇదే కుటుంబంపై రెండు సంవత్సరాల క్రితం దాడి జరిగిన, భద్రత కల్పించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ఇవి అధికారికంగా పోలీసుల కేసు నమోదు చేసిన ఘటనలు. కేసు నమోదు చేయనవి ఎన్నో. జిల్లాలో వరుసగా జరుగుతున్న ఘటనలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఘటనలు జరిగాక స్పందించడం కంటే ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన పోలీసు యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరం. మునగలపాలెంలో చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడు గతంలోనూ ఇలాంటి దారుణానికి పాల్పడి, జైలు శిక్షణ అనుభవించిన పరివర్తన లేదు, పైగా అతనిపై కనీస నిఘా కూడా పెట్టలేదు. గుడూరులో ఘటన కూడా గత మూడేళ్లుగా నిందితుడు వేధిస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. తిరుపతి ఘటన సైతం, ఇదే కుటుంబంపై రెండేళ్ల క్రితం దాడి జరిగింది. దీంతో భయాందోళన చెందిన బాధిత కుటుంబం తమ కుమార్తెను వారికి దూరంగా సుదూర ప్రాంతంలో చదివిస్తున్నారు. సెలవుపై ఇంటికి వచ్చిన సమయంలో దాడి ఘటన చోటు చేసుకుంది. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేస్తే కొంత మార్పు తీసుకురావచ్చని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. పోలీసు యంత్రాంగం స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం...!

రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

110 వాహనాలు సీజ్


చిత్తూరులో వాహనాలు సీజ్ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలోని గాంధీ కూడలి వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 110 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం సరైన పత్రాలు చూపించి, నెంబర్ ప్లేట్ వేయించుకున్న వాహనాలను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రోడ్డు భద్రతా అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించడం అనివార్యమని, ప్రతి వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు, సక్రమమైన వాహన పత్రాలు ఉండటం అత్యంత ముఖ్యమని తెలిపారు. వాహన నియమాలు పాటించని పక్షంలో, వారి వాహనాలు స్వాధీనం చేసుకోవడం లేదా వారికి చట్టపరమైన శిక్షలు విధించడం జరుగుతుంది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లు ప్రజల భద్రత కోసం నిర్వహించబడుతున్నాయి. కొందరు వ్యక్తులు నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను వినియోగిస్తే, ఆ వాహనాలను గుర్తించకపోవడం వల్ల అవి దొంగతనం అయ్యే అవకాశం ఉందని, దొంగతనం జరిగిన వాహనాన్ని ఎవరైనా దుర్వినియోగం చేస్తే, ఆ వాహన యజమాని అనవసరంగా సమస్యల ఎదురుకోవల్సి వస్తుందని అన్నారు.రోడ్డు భద్రతా నియమాల్లో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం కీలకమని, బైక్ లేదా స్కూటర్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు చాలా ముఖ్యమని, ఇది తల, మెడ గాయాల నుండి రక్షణనిస్తుందని అన్నారు. అలాగే కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా తీవ్ర గాయాలను నివారించవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారానే సురక్షితంగా ప్రయాణించవచ్చు అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం: రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటకృష్ణ అన్నారు. శనివారం గాండ్ల మిట్టకూడలిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటకృష్ణ మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని, ర్యాష్ డ్రైవింగ్ చేసిన కేసులు నమోదు చేసి భారీగా జరిమాన విధస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనంలో ట్రిపుల్స్ వెళ్లినా కేసునమోదు చేస్తామని చెప్పారు. మైనర్ బాలికలు వాహనాలు నడిపినా వాహనాన్ని సీజ్ చేయడమే కాకుండా వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం లైసెన్సులు, వాహనాలకు సంబందించిన రికార్డులు సక్రమంగా లేని వాహనాదారులను స్టేషన్ వద్ద రోడ్డు నిబంధనలపై అవహాన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: రోడ్డు భద్రతలు తూచా తప్పక పాటించాలని సిఐ లక్ష్మయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, వాహనానికి సంబంధించిన కాగితాలు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. రోడ్డు భద్రతలు పాటిస్తూ వాహనాల నడపాలన్నారు. సిబ్బంది బెనర్జీ, అనిత పాల్గొన్నారు.

కుప్పం టౌన్: పట్టణంలోని ఐఆర్ఎం డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యక్షులు బిఎం.దయానిధి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతలు తూచా తప్పక పాటించాలని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుప్పం జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు న్యాయమూర్తి ఆరిఫా షైక్, పట్టణ సిఐజిటి నాయుడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించడానికి సహకరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని తెలియజేశారు. వాహనదారులు రహదారి నియమాలను పాటించకపోయినా, హెల్మెట్ ధరించకపోయినా చట్టరీత్య శిక్షార్హులవుతారని తెలిపారు.


కార్వేటినగరంలో..

బషీర్‌ను అభినందించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరుకు చెందిన బషీర్ అనే యువకుడు పర్యావరణ పరిరక్షణలో భాగంగా సేవ్ ట్రీస్-సేవ్ ఫారెస్ట్ పేరిట పలమనేర్ నుంచి లడక్ వరకు ఈసైకిల్ యాత్ర చేశాడు. ఈ సందర్భంగా బషీర్‌ను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అభినందించారు. పలమనేరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన బషీర్ జూన్ 12న ఈ సైకిల్ యాత్రను ప్రారంభించి లడక్ పర్యటనను ముగించుకొని శుక్రవారం రాత్రి ఇక్కడికి చేరుకున్నారు. దీంతో ఆ యువకున్ని స్థానిక ఎమ్మెల్యే అభినందించారు. నేటి యువతకు ఆదర్శంగా నిలవడంతో పాటు పర్యావరణ హితం కోరుతూ యాత్ర చేపట్టడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. భవిష్యత్తులో నేపాల్, ఇతర ప్రాంతాలలో యాత్రను చేపట్టనున్నట్లు బషీర్ పేర్కొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అపోలో ఎన్ఎస్ఎస్, 1, 2 విభాగాల విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎన్ఎస్ఎస్ 1 విభాగంకు డాక్టర్ శాంహజ్, డాక్టర్ అశోక్ రెడ్డి, రెండో విభాగంకు డాక్టర్ జాకీర్ పర్యవేక్షణలో జరిగింది. డాక్టర్ జయప్రియ, పోలీసు అధికారి విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మత్తుపదార్థాల వాడడం అధికమైందని, దీని వలన యువత తమ భవిష్యత్తుతోపాటు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. చెడు ప్రభావాలు కలిగించే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడకం చట్ట విరుద్ధమని తెలిపారు. ర్యాలీలో అపోలో విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ వినోద్ భట్, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అవగాహన

ప్రజాశక్తి- సోమల:మండల కేంద్రమైన చౌడేపల్లి గ్రామంలోని వెలుగు కార్యాలయంలో చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చౌడేపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు లో ఉండే బంగారు రుణాల పైన తక్కువ వడ్డీ సేవలు, వ్యవసాయ రుణాలపైన తక్కువ వడ్డీలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమయోజన పథకం, సురక్ష భీమయోజన పథకం, అటల్ పెన్షన్ యోజన పథకం, డిజిటల్ లావాదేవీలు,సైబర్ క్రైమ్ మోసాల గురించి ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కలాజాత పాటలు, మాటల ద్వారా ప్రజలకి అర్థం అయ్యే రీతిలో తెలియజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ వెంకటేష్ బాబు, వెలుగు ఏపియం సర్వోత్తమరెడ్డి, జిల్లా అధికారులు గిర్వాణి, రోహిత్, అక్రమ్ బాష, కళాజాత బృందం సభ్యులు మేజీషియన్ విజయ్, డప్పు కళాకారులు చిరంజీవి, వెంకటేష్ పాల్గొన్నారు.


రెండు గ్రామాలను భువనేశ్వరి దత్తత

23-26 తేదీల్లో కుప్పంలో పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'కుప్పం నియోజకవర్గంలో ఏ బూత్ పరిధిలో నారా చంద్రబాబునాయుడుకు భారీ మెజార్టీని ఇస్తుందో ఆ గ్రామాలను దత్తత తీసుకుంటా' అని ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. ఈ మేరకు కుప్పం మండలం పైపాళ్యం, గుడిపాల మండలం కంచిబందార్లపల్లి గ్రామాల్లో భారీ మెజార్టీ వచ్చింది. కంచిబందార్లపల్లి బూత్‌లో టిడిపికి 1256 ఓట్లు మెజార్టీ వచ్చింది. అలాగే పైపాళ్యం బూత్ పరిధిలో 1,053 ఓట్లు మెజార్టీ వచ్చింది. వైసిపికి ఆ రెండు బూత్‌ల్లో కనీసం 35శాతం కూడా ఓట్లు పడలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 23-26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటించి, ఆ గ్రామాలను దత్తత తీసుకునే విషయమై అధికారికంగా ప్రకటించనున్నట్లు కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంఎల్ఎ కంచర్ల శ్రీకాంత్ వెల్లడించారు. అలాగే టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా కుప్పం రానున్న నారా భువనేశ్వరికి కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లి మండలాల్లో పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రణాళికా బద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


తవణంపల్లిలో ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- తవణంపల్లి: రాష్ట్రప్రభుత్వం పాఠశాలల రూపురేఖలే మారుస్తున్నామని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. తవణంపల్లి మండలం, అరగొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యాసామగ్రిని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తెల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన దాత ఎంఆర్‌సీ.మోహన్ నాయుడు సహాయంతో మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం రూ.35వేల నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అరగొండ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షిత మంచి నీరు అందించడం కోసం కొండ్రాజుకాలువ పంచాయతీ సర్పంచ్ దాత పరంధామ నాయుడు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. కొద్దిరోజుల వ్యవధిలోనే అరగొండ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు సురక్షిత మంచి నీరు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని చెప్పారు. తనను కలిసేందుకు వచ్చేవారు బొకేలు, శాలువాలు తీసుకురావద్దని పెన్నులు, పెన్సిళ్ళు, పుస్తకాలు తీసుకురావాలని, వాటిని తీసుకువస్తే విద్యార్థులకు అందజేస్తానన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారని, విద్యావ్యవస్థలో సమూల మార్పుల దిశగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, క్లస్టర్ ఇంఛార్జ్ ఎంఆర్‌సీ.మోహన్ నాయుడు, కోండ్రాజుకాలువ సర్పంచ్ పరంధామ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ కోరారు. కుప్పం పట్టణంలోని కొత్తపేటలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను అందుకునేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుకోవాలని పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు గోపీనాథ్, కృష్ణన్, కృష్ణ, లోకి పాల్గొన్నారు.


కుప్పంలో..

సిఆర్ రాజన్‌పై
ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:

టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ పట్ల మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టిడిపిలో బీసీలకు ఉన్నత స్థానం కల్పిస్తే చులకన భావం చూపడం తగదన్నారు. బిసి కులానికి చెందిన నేతల గురించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే నిన్ను, మీ కుమారుడిని చిత్తుచిత్తుగా ఓడించినా జ్ఞానోదయం కాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఇలాంటి చవకబారు ఆరోపణలు చేస్తే ప్రజల్లో తిరగకుండా తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.


రోజూ మినరల్ వాటర్

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని గుండిగల్లు పంచాయతీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుతూ ఉండగా గత కొంతకాలంగా విద్యార్థులు కలుషిత నీరు తాగుతూ రోగాల భారిన పడటాన్ని గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకులు జయసింహ గుర్తించారు. దీంతో ఆయన ఆధ్వర్యంలో శనివారం రోజూ విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేలా తన మిత్రుల సహకారంతో రోజుకు 15 వాటర్ క్యానుల చొప్పున శాశ్వతంగా ఈ కార్యక్రమాన్ని నడిపిస్తామని తెలిపారు. ప్రతిఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించి విద్యార్థులు ఆరోగ్యాలను కాపాడాలన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఆయనను అభినందించారు.

చెక్కులు అందించి వెంకటేగౌడ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : 2024 ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకుల దాడికి గురైన బైరెడ్డిపల్లి మండలం వెంగంవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు రవి, రాజేశ్వరి, భాస్కర్, మురుగేష్‌లకు శనివారం రూ.50 వేలు చెక్కును పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ అందజేశారు. తోటకనుమలోని క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, తాను ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటన



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి, ఎర్రకదిరేపల్లి గ్రామాల్లో జ్వరాల నివారణ కోసం డాక్టర్ విజయచంద్ర ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటి సర్వేని నిర్వహించారు. శనివారం గ్రామాల్లో పర్యటించిన జర్వంతో బాధపడుతున్న పలువురికి రక్తపరీక్షలు చేశారు. అలాగే మందులను అందించారు. గ్రామస్తులందూ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, పుష్పలత, జ్యోష్న, పద్మ, విజయమ్మ, అమరమ్మ పాల్గొన్నారు.

'అధికారులు విద్య, వైద్యంపై దృష్టి సారించండి'



ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ వర్షాకాలంలో వస్తున్న వ్యాధుల పట్ల ప్రజల్లో ఎప్పటికప్పుడు అవగాహన పరుస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన జూనియర్ కాలేజీలో విద్యార్థులు చేర్చేందుకు ప్రజాప్రతినిధులు పదవ తరగతి పూర్తయిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి జూనియర్ కాలేజీలో చేర్పించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ కోరారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం పథకంలో వంటమ్మలు శుభ్రత పాటించడం లేదని మండల విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సిరికల్చర్, ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు ప్రభుత్వం అందించ స్కీములను రైతులకు వివరించాలన్నారు. అనంతరం మండలంలో పెన్షన్ల పంపిణీ, ప్రోటోకాల్ ప్రభుత్వ కార్యాలయాలకు బ్యానర్లు అంటించి కార్యాలయం కనబడకుండా టిడిపి నాయకులు చేశారని వాటిని తొలగించాలని వైస్ ఎంపీపీ జీడి.బాబు ఎంపీడీవో అబ్దుల్ రహీంను కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ పెన్షన్లను ఇప్పటికే వస్తున్న ప్రతి ఒక్కరికి అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కొళత్తూరు పంచాయతీలో మాత్రం జిల్లా అధికారుల ఆదేశంతో ఇద్దరికీ డప్పు కళాకారులకు పెన్షన్లు పంపిణీ చేయలేదని అన్నారు. ఈ సందర్భంగా వీరప్పల్లి ఎంపిటిసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో వాలంటీర్లు కొంతమంది నాయకుల ప్రోత్సాలంతో తప్పులు తడకగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జరిగిందని ఆ మ్యాపింగ్ ఆధారంగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అధికారులను తప్పు పట్టవద్దని వైస్ ఎంపీపీకి సూచించారు. డిప్యూటీ తహశీల్దార్ ఫణికుమార్, మండల స్థాయి అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించన దుర్యోధన వధ

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీద్రౌపదీ, ధర్మరాజులస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ దురోద్యన వధ ఘట్టం హరికథా కాలక్షేపాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు ఆలపించారు. సాయంత్రం శ్రీవేంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగమడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. దుర్యోధన పాత్రదారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడిపెట్టించింది. దుర్యోధన వధ ఉభయదారులుగా తూర్పు వీధివారు వ్యవహరించారు. అలాగే 2003లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆలయ ఆవరణంలో వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు అగ్ని గుండప్రవేశం

శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ అధ్యక్షుడు సోమనాథ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణంలో అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని మొక్కులున్న భక్తులు అగ్ని గుండ ప్రవేశానికి రూ.400లు చెల్లించి కంకణం ధరిచాలన్నారు. మహిళలకు అగ్ని గుండ ప్రవేశం లేదని, మొక్కులున్న మహిళలు కంకణాలు ధరించి అగ్నిగుండం చుట్టు ప్రదక్షణ చేసి మొక్కులు తీర్చుకోవాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, క్రిష్ణయ్య, పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు కుప్పం టిడిపి నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం నాడు పట్టణ పరిధిలోని 15వ వార్డు ఇంచార్జ్ సుకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వార్డు పరిధిలో పర్యటించి ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణం తప్పనిసరిగా ఉండాలని సూచిస్తూ, మంచినీటి సరఫరా, మురికి కాలువల పరిశుభ్రత, పారిశుధ్య పనుల నిర్వహణ వంటి వాటిపై ఆరా తీశారు. టిడిపి నాయకులు సుజి, హరినాథ్ గౌడ్, సచివాలయ బిఎల్‌ఓ మహేశ్వరి పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 50/2024

1) కవలకుంట్ల సుబ్బయ్య మరియు ఇతరులు ... వాదులు

వర్సెస్

సైమన్ యూనిస్ .... ప్రతివాది

టు,
సైమన్ యూనిస్, భర్త: హెచ్.సైమన్,
నివాసం: ఇంటి నెం: 1-54,
సూరుడుపల్లె (గ్రామం మరియు పోస్టు)
నాగలాపురం మండలం, చిత్తూరు జిల్లా.

పై నెంబరు దావాలో సమన్లు ప్రతివాదికి ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 09-08-2024 ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా నీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇట్లు
ఇ.శారద, అడ్వకేట్
మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 49/2024

కాళంగి నడిపి అల్లూరయ్య ..... వాది

వర్సెస్

సైమన్ యూనిస్ ...... ప్రతివాది

టు,
సైమన్ యూనిస్, భర్త: హెచ్.సైమన్,
నివాసం: ఇంటి నెం: 1-54,
సూరుడుపల్లె (గ్రామం మరియు పోస్టు)
నాగలాపురం మండలం, చిత్తూరు జిల్లా.

పై నెంబరు దావాలో సమన్లు ప్రతివాదికి ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 09-08-2024 ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా నీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇట్లు
ఇ.శారద, అడ్వకేట్
మార్కాపురం.

ప్రజలకు అందుబాటులో ఉంటా: కమిషనర్


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ఇటీవల కాలంలో కుప్పం పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు తన విధులలో విలీనమయ్యారు. శుక్రవారం నాడు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తన విధులను శనివారం నుండి ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం పారిశుధ్య సిబ్బంది, వర్కర్లుతో మస్టర్‌కు హాజరై వారికి తగు సూచనలు జారీ చేసి, అనంతరం పట్టణ పరిధిలోని వార్డులలో పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా పురపాలక సంఘ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో స్టాఫ్ డయేరియా సమావేశంను కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ విధిగా రోజు నీటినిల్వలను యధావిధిగా శుభ్రపరచుకోవాలని, దోమలు లార్వాలను పెరగకుండా డ్రైడే పాటించాలని సూచించారు. మునిసిపాలిటీ ఏరియా లోతట్టు ప్రదేశాలను గుర్తించి డ్రైన్‌లో ఏవైనా మురుగు నీటి పారుదలకు అడ్డువుంటే శుభ్రపరచి, దోమల నిర్మూలనకు మందులను పిచికారి చేయాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహాల్లో దోమల కాటు నుండి రక్షణ పొందుటకై మెష్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దోమకాటు వలన వచ్చే వ్యాధులు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. పురపాలక మేనేజర్ ఇమ్రాన్ ఖాన్, మెడికల్ ఆఫీసర్‌డాక్టర్ సాయిహిమంత్, ఆరోగ్య, ఆశాలు పాల్గొన్నారు.

సత్వర ఫలితాలిస్తున్న
ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 12వ తేదీన చిత్తూరు పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ (కుటుంబ సలహా కేంద్రం)ను చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ప్రారంభించారు. ప్రతి శనివారం కుటుంబాల కోసం ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా శనివారం కౌన్సిలింగ్ సెంటర్‌కు వచ్చిన మూడు కుటుంబాలకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మనస్పర్ధలు పోగొట్టి, కలహాలు తలెత్తకుండా పోలీసులు, కౌన్సిలింగ్ సెంటర్ సభ్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కౌన్సిలింగ్ అనంతరం మూడు కుటుంబాలు పోలీసులకు, సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సలహా కేంద్రం ద్వారా కుటుంబ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, మహిళలపై జరిగే హింసను తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కుటుంబ సలహా కేంద్రం వలన కుటుంబాలలో తలెత్తే వివాదాలు, గొడవలు, ఇతర సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చు. ఈకేంద్రంలో మానసిక నిపుణులు, కౌన్సిలర్లు, చట్ట నిపుణులు అందుబాటులో ఉంటారు. వీరు బాధితులకు సలహాలు, మార్గదర్శకాలు అందించడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో సహకరించగలరని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

ముత్యాలమ్మ జాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల: యాదమరి మండలం కొటాల గ్రామంలో ముత్యాలమ్మ జాతరలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ పాల్గొన్నారు. ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ముత్యాలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పరుగు పందెం కార్యక్రమంకు ఎమ్మెల్యే హాజరై ఆసక్తిగా తిలకించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎద్దుల పరుగు పందెంలో వీక్షకులు జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలు అప్రమత్తం ఉండాలని సూచించారు.

డెంగీ మాసోత్సవ అవగాహన

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటిమంద గ్రామంలో సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో డెంగీ మాసోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేతులు శుభ్రంగా కడుక్కొని తర్వాత ఆహారం తినాలని పిల్లలకు తెలియజేశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమర్నాథ్ ఎమ్మెల్ హెచ్‌పి శాంభవి, ఏఎన్ఎం మదనిక, ఉపాధ్యాయురాలు లతా, ఆశా కార్యకర్తలు గుణవతి, శ్రీలత, నాగరత్న పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE CUM JUDL.1ST CLASS MAGISTRATE (JUNIOR DIVISON), CHITTOOR

O.S.No. 899 OF 2023

Between:
T.Ambika @ Ambikavathy ... Plaintiff
And:
G.Suresh & 11 others ...Defendants

SUIT SUMMONS TO DEFENDANT NOS.1,3,4 & 5

D1.G.Suresh
S/o Late G.Venkatesulu Chetty
D3.G.Lokesh
S/o Late G.Venkatesulu Chetty
D4.G.Prakash
S/o Late G.Venkatesulu Chetty
D5.G.Satheesh
S/o Late G.Venkatesulu Chetty

D1,D3,D4 & D5 are permanent residents of Jandra Street,Penumur Village,Post & Mandal,Chittoor District, AP

Sirs,

The Plaintiff has filed above suit against you and others seeking relief of division of the suit schedule properties. Please take notice that the above case now stands posted to **09-08-2024** for your appearance and for filing objections. On that day you shall appear personally or through an advocate at **10-30 A.M** before the said Hon'ble Court. Inspite of this notice,If you fail to appear and file your objections the matter will be decided Ex-pate in your absence.

Sd/-S.BALAIAH,B.A.B.L.,
Advocate for the Plaintiff